# దొంగసొమ్ము - దొంగలపాలు



వరప్రసాదరావు సంఘసేవకుడు.

ఊళ్లో వరదలు వచ్చినా, ఇళ్లు కాలినా, అంటువ్యాధులు ప్రబలినా, డబ్బా పుచ్చుకునీ, రసీదు పుస్తకం చంకన పెట్టుకునీ సహాయ నిధి వసూలు చేయడానికి వస్తుంటాడు.

అతనికి అనేక రాజకీయ పార్టీలతో ప్రత్యక్షంగానో, పరోక్షంగానో సంబంధం వుంది. అందరికీ తలలో నాలుకగా వుంటాడు. అతనికి ఉన్నట్టుండి హరిజనుల కోసం ఒక ధర్మసత్రం కట్టించాలని బుద్ధి పుట్టింది.

అందుకోసం ఊరి పెద్దలతో ఒక కమిటీని వేసి తాను అధ్యక్షపదవి పుచ్చుకున్నాడు. కమిటీ మెంబర్లు నలుగురినీ వెంట వేసుకుని వెళ్లి ఘనంగానే చందాలు వసూలుచేయడం మొదలు పెట్టాడు. ఆ డబ్బుని బ్యాంకులోనే వేసేవారు కాని.., ప్రజాధనానికి సంబంధించిన ఖాతాలు ఇద్దరి పేరుమీద వుండాలి. కమిటీ ఐతే వేశారు కానీ, కోశాధికారిగా ఆ నియామకం జరిగేవరకూ డబ్బును ఆయన దగ్గరే ఉంచమన్నారు కమిటీ పెద్దలు. అందుకు అయిష్టంగా ఒప్పుకున్నాడు వరప్రసాదరావు.

ఉన్నట్టుండి- ఊళ్లో దొంగతనాలూ, బందిపోటు దొంగతనాలు ఎక్కువగా జరగడం మొదలుపెట్టాయి. 'బయటి ఊళ్లనుంచి దొంగలు వచ్చారని కొందరంటే.., 'ఉన్న ఊరి దొంగలే వీరంతా!' అని మరికొందరు అనుకోసాగారు. ఏరోజు ఎవరింటి మీద దొంగలు విరుచుకుపడతారోనని ప్రజలు ప్రాణాలు గుప్పిట్లో పెట్టుకుని బిక్కుబిక్కుమంటూ గడపసాగారు.

ఆరోజు రాత్రి దొంగల కన్ను ప్రజాసేవకుడు 'వరప్రసాదరావు' ఇంటిమీద పడింది.

ఆయన అతిజాగ్రత్తగా బీరువాలో దాచిన ప్రజాధనాన్ని ఎత్తుకుపోయారు దొంగలు.

ఈ వార్త ఊరంతా గుప్పుమని వ్యాపించింది.

మర్నాడు అత్యవసరంగా కమిటీ సమావేశాన్ని ఏర్పాటు చేశాడు వరప్రసాదరావు.

వారిముందు- "అయ్యలారా! ఈ దొంగలు ప్రజాధనం బదులు నాకున్న సర్వస్వం- అఖరికి నా ప్రాణం అయినా దోచుకుపోయుంటే ఇంత బాధపడేవాడిని కాను. కానీ, నాదంటూ ఏదీ లేకపోవడంతో వారికి అవకాశం చిక్కక ప్రజాధనం మీద వారి కన్ను పడింది. ఏది ఏమైనా ప్రజాధనం నా ఇంట్లో ఉండగా పోయినప్పుడు- అది ఎలా జరిగినా దాని పూర్తి బాధ్యత నాదే! చీమూ,నెత్తురూ కూడబెట్టయినా ఆ బాకీ తీరుస్తాను. ప్రజాధనాన్ని సంరక్షించలేని నన్ను ఈ అధ్యక్ష పదవి నుంచి తప్పించవలసిందిగా వేడుకుంటున్నాను" అంటూ కళ్లనీరు పెట్టుకుని మాట్లాడాడు.

ఆయన మాటలకి మెంబర్ల హృదయాలు ద్రవించాయి.

"అనుకోకుండా జరిగిన ఈ దుర్ఘటనకి మీరెలా బాధ్యులవుతారు? మీరే అధ్యక్షులుగా వుండండి" అంటూ బలవంతం మీద వరప్రసాదరావుని ఒప్పించారు.

వారంరోజులు గడిచేసరికి- తిరిగి వరప్రసాదరావు ఇంట్లో దొంగలు పడ్డారు. కుటుంబమంతా ఊరికి వెళ్లడంతో ఆయనొక్కడే ఇంటికి కాపలాగా వున్నాడు.

దొంగలు వరప్రసాదరావుని గట్టిగా పట్టుకుని డబ్బూ, వస్తువులు చూపించమని బెదిరించారు.

ఆయన తొణక్కుండా- "నా దగ్గరేముంది నాయనలారా! నాకున్న ఆస్తి అంతా పుస్తకాలే. వాటిని చదువుకుంటూ కాలక్షేపం చేస్తాను. కావలిస్తే ఇల్లంతా వెతుక్కోండి!" అన్నాడు.

వాళ్ళు అలమారలూ, బీరువాలూ తెరిచి చూశారు. వాటన్నిటి నిండా పుస్తకాలే! వంటింట్లో పాత సామాను తప్ప వేరేమీ లేదు.

దొంగలు మళ్లీ గదిలోకి వచ్చి తల పైకెత్తి చూశారు. సజ్జమీద కప్పును అంటుతూ పుస్తకాలు నిండుగా వున్నాయి.

వరప్రసాదరావు చిరునవ్వుతో- "చూడండి బాబూ... అన్నీ పుస్తకాలే!" అంటూ కంగారుపడసాగాడు.

ఆ మాటలు వాళ్ళేమీ వినిపించుకోలేదు.

పైన వెతుకుతున్న మనుషులకి పుస్తకాల మధ్య ఒక పెద్ద సూట్‌కేస్ కనిపించింది.

దానిని తెరిచిచూస్తే దానినిండా అన్నీ నగలూ, విలువైన వస్తువులు, నోట్ల కట్టలూను. ఆ పెట్టె పుచ్చుకుని, అబద్ధమాడినందుకు వరప్రసాదరావు నెత్తిన ఓ దెబ్బవేసి ఉడాయించారు దొంగలు.

ఆ పెట్టెలో ఉన్న నోట్లు వరప్రసాదరావు దాచిన ప్రజాధనం!

జరగని దొంగతనాన్ని ప్రచారం చేసి ఆ డబ్బు కాజేయాలని చూశాడు. కాని, దాచిన దానితోపాటు- అతని సొత్తును కూడా దొంగలు దోచుకుపోయారు.

దొంగ సొమ్ము దొంగలపాలయ్యింది.

*- ఉదయం వార పత్రిక... 9 ఫిబ్రవరి '90*



**స్వానుభవం**

ఒక గుమాస్తా తన బాస్ దగ్గరికి వెళ్లి తన జీతం పెంచాల్సిన అవసరం గురించి చెప్తూ-

"ఈ జీతంతో నేను జన్మలో పెళ్లి చేసుకోలేను సార్!" అని వాపోయాడు.

"నాకు తెలుసు. కొన్నేళ్లు పోతే ఇందుకు నువ్వు నాకు థాంక్స్ చెప్తావు" అన్నాడు భార్యాబాధితుడైన బాస్.